తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక


epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:65

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 04.11.2026 బుధవారం, హైదరాబాద్

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో నిరంతర చర్చలు జరపండి

- ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధం
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- అవసరమైన నిధులు జాయింట్ అకౌంట్‌లో జమ చేసేందుకు నిర్ణయం



2లో

దేశద్రోహులెవరో చర్చిద్దాం.. రండి

- ఆలస్యం చేయకండి..త్వరగా చర్చకు రండి..
- ఇప్పటికే 24 గంటలు గడిచిపోయాయి
- ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ మరోసారి సవాల్
- దేశద్రోహులెవరో చర్చిద్దాం.. ఏ వేదికపైనైనా సిద్ధమేనని స్పష్టీకరణ

2లో



ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మరోసారి సవాల్ విసిరారు. తనతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేసి ఇప్పటికే 24 గంటలు గడిచిపోయాయని, ఇంకా ఆలస్యం చేయకుండా చర్చకు రావాలని సూచించారు. ప్రతిపక్షాలను దేశద్రోహులుగా అభివర్ణిస్తూ బీజేపీ చేస్తున్న ఆరోపణలపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అసలు దేశద్రోహులు ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఆ సంబంధాల వెనుక ఉన్న వాస్తవాలేమిటో చర్చిద్దామని మోదీకి పిలుపునిచ్చారు.

ఓటు నమోదుకు గడువు పొడిగింపు



- నామినేషన్ల చివరి రోజు వరకు దరఖాస్తుకు అవకాశం
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ.
- వెల్లడించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాల్సీ ఓటు నమోదు ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన స్తు చేసుకునే గడువును పొడిగించింది. అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

ఫారం-18 ద్వారా దరఖాస్తు

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల

।మిగతా 2 లో।

సీఎం నిర్లక్ష్యంతోనే కరువు పరిస్థితులు

కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను పడావు పెట్టి రైతులకు అన్యాయం



- గోదావరి, కృష్ణా జలాలు సముద్రంలోకి వెళ్లినా సాగునీరు అందించలేకపోతున్నారు
- కేసీఆర్‌పై కక్షతో ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్నారు
- వెయ్యి టీఎంసీల నీరు సముద్రం పాలు.. రైతులకు మాత్రం కరువు
- కాళేశ్వరం, పాలమూరును నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ దుస్థితి
- నీళ్లు ఎత్తండి.. రైతులను ఆదుకోండి అని కోరినా పట్టించుకోలేదు
- ప్రకృతి వైపరీత్యం కాదు.. ప్రభుత్వ వైఫల్యమే కారణం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణలో మళ్లీ కరువు పరిస్థితులు ఏర్పడటానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రం పక్కనే గోదావరి నది పరవళ్లు తొక్కుతున్నా.. తెలంగాణలోని పొలాలు ఎడారులుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై రాజకీయ కక్షతో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూ రైతులకు సాగునీరు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకులు తెచ్చిన కరువు అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

తెలంగాణ చౌరస్తా,స్టేట్ బ్యూరో :

ప్రముఖ కవి, గోదావరి గొంతుకగా పేరొందిన మల్లావరుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదానోత్సవంలో కేటీఆర్ పాల్గొన్నారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2024-25 సంవత్సరానికి

।మిగతా 2 లో।

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను పరిష్కరిస్తాం
- గ్రాడ్యుయేట్లకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సర్వోత్తం రెడ్డి పనిచేస్తా
- ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీతక్క
- జిల్లాల మధ్య ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో వ్యత్యాసాలు తొలగిస్తాం
- ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్తా
- విద్యావంతుల గొంతుకగా శాసనమండలిలో నిలుస్తా
- నిరుద్యోగ సమస్య పరిష్కారమే ప్రధాన అజెండా
- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పించడమే లక్ష్యం
- నైపుణ్యాభివృద్ధి, విద్యారంగ సంస్కరణలకు పెద్దపీట
- గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి
- రాష్ట్ర మంత్రి సీతక్క



తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:

ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో నెలకొన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
మంగళవారం హనుమకొండలోని

।మిగతా 2 లో।



యూట్యూబ్ చూసి చోరీలు..

- అమాయక గృహిణి ముసుగులో మోస్ట్ వాంటెడ్ కిలాడీ
- అద్దె ఇల్లు తీసుకుని పక్కింటి వారితో పరిచయాలు
- అదను చూసి భారీ దొంగతనాలు
- ఉప్పల్ భారీ చోరీ కేసును ఛేదించిన మల్కాజిగిరి పోలీసులు..
- బీటెక్ మధ్యలోనే వదిలేసి నేరాల బాట పట్టిన నిందితురాలు

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

చూడటానికి ఎంతో అమాయకంగా ఉంటుంది. మాట కలిపితే ఆప్యాయంగా పలకరిస్తుంది. పక్కింటి వారితో స్నేహంగా ఉంటూ వారి కుటుంబంలో ఒకరిగా కలిసిపోతుంది. అవసరమైతే సాయం చేసేందుకు ముందుంటుంది. కానీ ఆమె వెనుక దాగి ఉన్న అసలు రూపం మాత్రం దొంగతనాలు చేయడమే. యూట్యూబ్ వీడియోలను చూసి చోరీలకు కొత్త పద్ధతులు నేర్చుకుని, పక్కా ప్రణాళికతో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ మహిళ ఉదంతం
హైదరాబాద్‌లో

।మిగతా 2 లో।



2లో

ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం..
- మూడు, నాలుగో విడతల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు
- మహిళల ఆర్థికాభివృద్ధికి రూ.73 వేల కోట్ల వడ్డీలేని రుణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

దేశద్రోహులెవరో చర్చిద్దాం.. రండి

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:

ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మరోసారి సవాల్ విసిరారు. తనతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేసి ఇప్పటికే 24 గంటలు గడిచిపోయాయని, ఇంకా ఆలస్యం చేయకుండా చర్చకు రావాలని సూచించారు. ప్రతిపక్షాలను దేశద్రోహులుగా అభివర్ణిస్తూ బీజేపీ చేస్తున్న ఆరోపణలపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అసలు దేశద్రోహులు ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఆ సంబంధాల వెనుక ఉన్న వాస్తవాలేమిటో చర్చిద్దామని మోదీకి పిలుపునిచ్చారు.సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తనతో చర్చకు రావాలని కోరారు. చర్చకు వేదిక, సమయం ఏదైనా తనకు అభ్యంతరం లేదని తెలిపారు. మీడియా ప్రతినిధులు, దేశ యువత సమక్షంలో ఇద్దరం ఒకే వేదికపై చర్చించుకుందామని పేర్కొన్నారు. ఈ విషయంలో భయపడాల్సిన అవసరం లేదని, ఆలస్యం చేయకుండా ముందుకు రావాలని మోదీకి సూచించారు.

ఈ చర్చకు ఎవరు న్యాయనిర్ణేతగా ఉండాలనేది ప్రధాని మోదీ నిర్ణయించుకోవచ్చని రాహుల్‌గాంధీ అన్నారు.అవసరమైతే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను కూడా న్యాయనిర్ణేతగా కూర్చోబెట్టవచ్చని వ్యాఖ్యానించారు. చర్చలో అన్ని అంశాలపై బహిరంగంగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు.దేశ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు సహా పలు అంశాలను చర్చకు తీసుకురావాలని రాహుల్‌గాంధీ ప్రతిపాదించారు. అమెరికాతో ఒప్పందం ఎలా కుదిరింది? అంత వేగంగా ఎందుకు జరిగింది? క్యాబినెట్‌కు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారు? అదానీ కేసులను ఎందుకు మూసివేశారు? ఎప్‌స్టీన్ వ్యవహారంలో ఉన్న అంశాలేమిటి? వంటి ప్రశ్నలపై ప్రజల సమక్షంలో చర్చిద్దామని పేర్కొన్నారు.

తనపై వస్తున్న ఆరోపణలను కూడా రాహుల్‌గాంధీ ప్రస్తావించారు. తనపై సుమారు 45 పరువు నష్టం దావాలు ఉన్నాయని పేర్కొంటూ, వాటి గురించి కూడా బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమని తెలిపారు. విదేశీ సంబంధాలకు సంబంధించిన తన ఆరోపణలపై పరువు నష్టం దావా ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు.దావా వేసినా దానిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎక్స్ వేదికగా వెల్లడించారు. చివరగా ప్రధాని మోదీకి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల ప్రధాని మోదీ విదేశీ సహాయంతో ప్రధానమంత్రి అయ్యారని, దేశ ఆర్థిక వ్యవస్థ విదేశీ శక్తుల నియంత్రణలో, మద్దతుతో కొనసాగుతోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. విదేశీ సోషల్ మీడియా కూడా మోదీకి మద్దతు ఇస్తోందని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. తాజాగా ఈ అంశాలపైనే మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమని రాహుల్ సవాల్ విసిరారు.మరోవైపు ఇటీవల గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకుండా అడ్డంకులు సృష్టించే శక్తులుగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. దేశాన్ని విభజించేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

ఈ నేపథ్యంలో మోదీ, రాహుల్‌గాంధీ మధ్య బహిరంగ చర్చకు సంబంధించిన సవాల్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో
నిరంతర చర్చలు జరపండి

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణంపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రతో ఇటీవల జరిగిన చర్చలు, ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పరిణామాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముంపునకు గురయ్యే భూములు, వాటి విస్తీర్ణం, ఇతర వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు బ్యారేజ్ నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో జమ చేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూముల ముంపునకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సర్వే నిర్వహించినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారుతుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించి గతంలో కుదిరిన ఒప్పందాలు, ఇతర ముఖ్యమైన అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని అధికారులకు సూచించారు. ఆ రాష్ట్ర అధికారులకు అవసరమైన సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం చేయవద్దని ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుని ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని దిశానిర్దేశం చేశారు.

తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణమే ప్రధాన అజెండాగా గత నెల 26న ముంబయిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్యారేజ్ నిర్మాణ ఆవశ్యకత, ప్రాజెక్టు ద్వారా కలిగే ప్రయోజనాలను మహారాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు.ఈ భేటీ అనంతరం బ్యారేజ్ పూర్తి స్థాయి నీటిమట్టం 148 మీటర్ల వరకు ఉండాలన్న గత నిర్ణయాన్ని పునఃసమీక్షించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణాన్ని 152 మీటర్ల ఎత్తు వరకు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అయితే గతంలో ఈ ప్రతిపాదనపై మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. 148 మీటర్ల వరకు నీటిమట్టం ఉండే అంశాన్ని మాత్రం పునఃపరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర సీఎం వెల్లడించారు. బ్యారేజ్ నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే ప్రాంతాలు, రైతులకు అందించాల్సిన పరిహారంపై కూడా గత సమావేశంలో చర్చ జరిగింది. బాధిత రైతులకు పరిహారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. ఈ నేపథ్యంలో ముంపు వివరాలపై సర్వే నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, శాఖ కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రమేష్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సీఎం నిర్లక్ష్యంతోనే కరువు పరిస్థితులు

తరువాయి భాగం

చెమన్ సింగ్, 2025-26 సంవత్సరానికి సంగిశెట్టి శ్రీనివాస్‌లకు స్మారక పురస్కారాలు అందజేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలందించిన తిరునగరి దేవకిదేవి, కవ్వంపల్లి స్వామిలను ప్రత్యేకంగా సత్కరించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో నెలకొంటున్న కరువు పరిస్థితులకు ప్రకృతి వైపరీత్యాలు కారణం కాదని, ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. తాను రాజకీయ అక్కసుతో ఈ వ్యాఖ్యలు చేయడం లేదని, వాస్తవాలను ఆధారంగా చేసుకుని మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు.ఈ ఏడాది ఏడున్నర నెలల వ్యవధిలో గోదావరిలోకి 750 టీఎంసీలు, కృష్ణా నదిలోకి 258 టీఎంసీల నీరు వచ్చిందని, దాదాపు వెయ్యి టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోయిందని కేటీఆర్ తెలిపారు. నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదని విమర్శించారు. సాగునీటి విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష, పాలమూరు ప్రాజెక్టుపై పగ, కేసీఆర్‌పై అక్కసుతోనే కీలకమైన సాగునీటి ప్రాజెక్టులను పక్కనపెట్టారని ఆరోపించారు. గోదావరిలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ తెలంగాణ రైతుల పొలాలకు సాగునీరు అందకపోవడం దురదృష్టకరమన్నారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి రాష్ట్రంలోని బీడు భూములకు నీరందించాలని డిమాండ్ చేశారు.

సదాశివుడి పాట ప్రజల్లో చైతన్యం నింపింది

మల్లావర్యుల సదాశివుడు చేసిన సాహిత్య సేవలను కేటీఆర్ కొనియాడారు.కష్టజీవుల పక్షాన నిలబడి, వారి బాధలను అక్షరాల్లో ఆవిష్కరించిన గొప్ప కవి అని అభివర్ణించారు. గోదావరిఖని నేలలోనే ఏదో ప్రత్యేకత ఉందని, కన్నీటి చుక్కల నుంచి కత్తులు మొలిపించే శక్తి ఆయన రచనలకు ఉందని పేర్కొన్నారు.జలసాధన ఉద్యమ సమయంలో సదాశివుడు రచించిన 'తలాపున పారుతుంది గోదావరి' పాట తెలంగాణ ప్రజల్లో చైతన్యం నింపిందని గుర్తుచేశారు. 'తెలంగాణ కోటి తరణాల వీణ' అనే మాటలో ఉన్నంత శక్తి, లోతైన భావం ఈ పాటలోనూ ఉన్నాయని అన్నారు. సదాశివుడు అజ్ఞాత సూర్యుడిలా తన సాహిత్యంతో ప్రజా ఉద్యమానికి వెలుగునిచ్చారని కొనియాడారు.

తెలంగాణ ఉద్యమంలో పాటలదే కీలక పాత్ర

మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల్లో నమ్మకం, స్ఫూర్తి నింపేందుకు కేసీఆర్ స్వయంగా పాటలు రాసిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. 2001లో ఉద్యమం ప్రారంభమైనప్పుడు తెలంగాణ రాష్ట్రం సాధ్యమవుతుందా? అనే అనేక సందేహాలు వ్యక్తమయ్యాయని తెలిపారు. ఉద్యమంలో కొందరు నాయకులు మధ్యలోనే వెనుదిరిగిన సందర్భంలో ప్రజల్లో ధైర్యం నింపేందుకు కేసీఆర్ పాటను రచించారని వివరించారు. సిపాయిల తిరుగుబాటు విఫలమైందని భావిస్తే దేశానికి స్వాతంత్ర్యం వచ్చేదా? ఎన్నో పోరాటాలు, త్యాగాల తర్వాతే విజయం సాధ్యమవుతుందని ఆ పాట ద్వారా ప్రజలకు సందేశం ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ముందుకు సాగిందన్నారు. గోదావరి జలాలను తిరిగి తెలంగాణ పొలాలకు మళ్లించి రైతులకు సాగునీరు అందించడమే మల్లా వర్యుల సదాశివుడికి అర్పించే నిజమైన నివాళి అని కేటీఆర్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం మరోసారి అభివృద్ధి, వికాసంలో దీపస్తంభంలా వెలుగొందాలని ఆకాంక్షించారు.

ఓటు నమోదుకు గడువు పొడిగింపు

తరువాయి భాగం

నియోజకవర్గాలకు చెందిన అర్హులైన ఓటర్లు ఓటు నమోదు కోసం ఫారం18 సమర్పించాలని సీఈవో సూచించారు. ఈ నెల 6వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 25న ప్రకటించనున్నట్లు తెలిపారు.

అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం

ముసా22యిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా నవంబర్ 25 నుంచి డిసెంబర్ 12 వరకు అభ్యంతరాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఈ సమయంలో కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకునే పట్టభద్రులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా

ముసాయిదా జాబితాపై అందిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను అధికారులు పరిశీలించనున్నారు. వాటి పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం డిసెంబర్ 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు సీఈవో వెల్లడించారు.

నామినేషన్ల చివరి రోజు వరకు నమోదు

తుది ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత కూడా ఓటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు వరకు అర్హులైన పట్టభద్రులు ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.గ్రాడ్యుయేట్ ఓటు నమోదు అనేది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సాంకేతిక సమస్యలతో నిలిచిన ఆన్‌లైన్ దరఖాస్తులు

సీఈవో వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో గత రెండు రోజులుగా ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఓటు నమోదు చేసుకోవాలనుకున్న పట్టభద్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే మంగళవారం మధ్యాహ్నం సాంకేతిక సమస్యలను అధికారులు పరిష్కరించడంతో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది.



అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి
ప్రభుత్వం కట్టుబడి ఉంది

తరువాయి భాగం

హంటర్ రోడ్డులో ఉన్న డీ కన్వెన్షన్ సెంటర్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఆత్మీయ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్కతో పాటు కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలను వివరించారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో జిల్లాల మధ్య వేర్వేరు విధానాలు అమలవుతున్న అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. జనగామ, హనుమకొండ సహా అన్ని జిల్లాలు ఒకే రాష్ట్రంలో భాగమని, ప్రతి జిల్లాలో ఒకే విధమైన విధానం అమలయ్యేలా ఉన్నతాధికారులతో చర్చిస్తామని వెల్లడించారు.

విద్యారంగంలో పనిచేసేవారి సమస్యలకు ప్రాధాన్యం

ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత వారిపై ఉంటుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. విద్యారంగంలో పనిచేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణనలోకి తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వానికి, గ్రాడ్యుయేట్లకు వారధిగా సర్వోత్తం రెడ్డి

కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిది సుదీర్ఘ రాజకీయ, ప్రజాసేవానేపథ్యం కలిగిన కుటుంబమని సీతక్క అన్నారు. ఆయన తండ్రి, పెదనాన్న ప్రజాజీవితంలో కీలక పాత్రపోషించారని, రామిరెడ్డి వెంకటరెడ్డి, రామిరెడ్డి దామోదర్ రెడ్డి గతంలో మంత్రులుగా ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. సర్వోత్తం రెడ్డి ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు కార్పొరేట్ రంగంలోనూ విశేష అనుభవం సంపాదించారని తెలిపారు. గ్రాడ్యుయేట్ల సమస్యలను అర్థం చేసుకుని, వాటిని ప్రభుత్వానికి వివరించి పరిష్కరించే వారధిగా ఆయన పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిరుద్యోగం, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి

తనకు రాజకీయ నేపథ్యంతో పాటు విద్యారంగం, కార్పొరేట్ రంగాలపై అవగాహన ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి తెలిపారు. ఈ మూడు రంగాల్లో సంపాదించిన అనుభవాన్ని గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి వినియోగిస్తానన్నారు. తమది నాలుగు తరాలుగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కలిగిన కుటుంబమని పేర్కొన్నారు.తాను ఉన్నత విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో పనిచేశానని, కార్పొరేట్ రంగంలో ఆసియా స్థాయిలో సుమారు 7 వేల మంది ఉద్యోగులకు నాయకత్వం వహించే బాధ్యతలు నిర్వహించానని వివరించారు. ప్రస్తుతం గ్రాడ్యుయేట్లకు, ప్రభుత్వానికి మధ్య అంతరం పెరుగుతోందని, దానిని తగ్గించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, విద్యారంగ సంస్కరణలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న గుర్తింపు, రెన్యూవల్, బదిలీలు తదితర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సవంబర్ 6 గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజాసేవ కోసం ఆస్తులను త్యాగం చేసిన కుటుంబం

సర్వోత్తం రెడ్డిది రాజకీయ పదవుల కోసం కాకుండా ప్రజాసేవ కోసం ఆస్తులను సైతం త్యాగం చేసిన కుటుంబమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వారి కుటుంబంలో గతంలో పలువురు మంత్రులుగా పనిచేసినా, ప్రజల కోసం ఆస్తులను వినియోగించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు.సర్వోత్తం రెడ్డి ఉన్నత విద్యను అభ్యసించి పీహెచ్‌డీ పూర్తిచేయడంతో పాటు విదేశాల్లో చదివి, అంతర్జాతీయ స్థాయిలో కార్పొరేట్ రంగంలో అనుభవం సంపాదించారని తెలిపారు.

గ్రాడ్యుయేట్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

విద్యావంతుడు, అనుభవజ్ఞుడైన సర్వోత్తం రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికైతే గ్రాడ్యుయేట్ల సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వానికి వివరించగలరని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విమానాశ్రయం, మాస్టర్ ప్లాన్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం వేల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చామని వివరించారు. గత పదేళ్ల పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు.ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గత ప్రభుత్వం నుంచి వచ్చిన అప్పులు, వాటిపై వడ్డీలు చెల్లిస్తూనే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వివరించారు. విద్యాసంస్థల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. సర్వోత్తం రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికైతే గ్రాడ్యుయేట్లు, విద్యాసంస్థలు, ప్రభుత్వానికి మధ్య సమన్వయకర్తగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ వరంగల్ అధ్యక్షుడు ఎండీ ఆయూబ్ ఖాన్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ, కుడా చైర్మన్ గుండు సుధారాణి, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ రావు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



యూట్యూబ్ చూసి చోరీలు..

తరువాయి భాగం

వెలుగులోకి వచ్చింది.

ఉప్పల్ భారీ చోరీ కేసులో కీలక పురోగతి

హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాంతంలో జరిగిన భారీ చోరీ కేసును మల్కాజిగిరి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితురాలిని గుర్తించి ఆమె నేరాల వెనుక ఉన్న విధానాన్ని వెల్లడించారు. ఈ వివరాలను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి మీడియాకు వెల్లడించారు.

అద్దె ఇంట్లో ఉంటూ పక్కింటి వారితో స్నేహం

నిందితురాలు ముందుగా ఓ ప్రాంతంలో అద్దె ఇంటిని తీసుకుంటుంది. అనంతరం చుట్టుపక్కల ఇళ్లలోని వారితో పరిచయాలు పెంచుకుంటుంది. ముఖ్యంగా పక్కింటి వారితో సన్నిహితంగా మెలుగుతూ వారి కుటుంబ పరిస్థితులు, ఇంట్లో ఎవరు ఉంటారు? ఎప్పుడు బయటకు వెళ్తారు? వంటి వివరాలను తెలుసుకుంటుంది. తనపై ఎలాంటి అనుమానం రాకుండా అందరితో కలిసిపోతూ నమ్మకాన్ని సంపాదిస్తుంది. ఇదే అదనుగా భావించి ఇళ్లలో ఎవరూ లేని సమయాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

యూట్యూబ్ వీడియోలే నేరాలకు పాఠాలు!

దొంగతనాలకు సంబంధించిన పద్ధతులను యూట్యూబ్ వీడియోల ద్వారా నేర్చుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కొత్త పద్ధతులను తెలుసుకుంటూ వాటిని ఆచరణలో పెట్టి చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సాధారణ గృహిణిలా కనిపిస్తూ నేరాలకు పాల్పడటం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.

బీటెక్ మధ్యలోనే ఆపేసి నేరాల బాట

నిందితురాలు గతంలో బీటెక్ చదివినప్పటికీ, మధ్యలోనే చదువును నిలిపివేసినట్లు సీపీ సుమతి వెల్లడించారు. అనంతరం దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారినట్లు వివరించారు.

పోలీసుల దర్యాప్తులో మరిన్ని వివరాలు

ఉప్పల్ చోరీ కేసు నేపథ్యంలో పోలీసులు నిందితురాలి నేరాల విధానం, గతంలో చేసిన చోరీలు, ఇతర సంబంధిత అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో అద్దెకు దిగే వారి వివరాలు, కొత్తగా పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

లక్ష్మీదేవిపల్లి, తెలంగాణ చౌరస్తా:

గ్రామ అభివృద్ధి మాటల్లో కాదు..క్షేత్రస్థాయిలో పనులు చేసి చూపించడంలోనే ఉందని నిరూపిస్తూ రేగళ్ల పెద్ద తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ లావుడ్య పూర్ణ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.ఈ క్రమంలో గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద తండా,ఉయ్యాల వాడ గ్రామాలలో విద్యుత్ సదుపాయాల మెరుగుదలకు సంబంధించి నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు,వీధి దీపాల నిర్వహణకు అవసరమైన కేబుల్ వైర్ల మార్పులు,ఇతర విద్యుత్ సమస్యలను స్వయంగా పరిశీలించారు.అంతేకాకుండా ధరావత్ బాల్య హనుమాన్ బస్తీ కార్నర్ వద్ద విద్యుత్‌పై అధిక లోడ్ పడుతున్న సమస్యను గుర్తించి,ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో నూతన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడుస్తూనే సంబంధిత లైన్‌మెన్ బాలాజీని వెంట తీసుకొని గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి బస్తీని స్వయంగా తిరుగుతూ విద్యుత్ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి,అవసరమైన పనులకు ఎస్టిమేషన్లు రూపొందించేలా చర్యలు చేపట్టారు.



పదవి అనేది హోదా కోసం కాదు.. ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత కోసం అని చాటి చెబుతూ,ప్రజల మధ్య ఉంటూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న సర్పంచ్ లావుడ్య పూర్ణ పనితీరుపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎండైనా.. వానైనా.. ప్రజల అవసరాలే ప్రథమ ప్రాధాన్యతగా భావిస్తూ గ్రామంలోని ప్రతి బస్తీకి మౌలిక సదుపాయాలు కల్పించి,అభివృద్ధి ఫలాలు ప్రతి గడపకు చేరేలా తన వంతు కృషి కొనసాగిస్తానని సర్పంచ్ లావుడ్య పూర్ణ తెలిపారు."హామీలు ఇచ్చి వెళ్లడం కాదు.. ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను గుర్తించి,పరిష్కారం చూపించడమే నా రాజకీయ విధానమని,గ్రామ అభివృద్ధే నా లక్ష్యం..ప్రజాసేవే నా బాధ్యత" అని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

ప్రజా సంక్షే





ఆరుతడి పంటల సాగుకు జిల్లా వ్యవసాయ అధికారి సూచన

- నేల సారం కాపాడుకోవడంతో పాటు పురుగుమందుల వాడకంపై రైతులకు అవగాహన

కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:

కమాన్‌పూర్ మండలంలోని గుండారం గ్రామంలో ఉన్న రైతు వేదికలో మంగళవారం రైతులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం దృష్ట్యా నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉనందున, రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి వినియోగంతో అధిక ఆదాయాన్నిచ్చే ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అనంతరం మంథని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. అంజని మాట్లాడుతూ.. సేంద్రియ పద్ధతులు, సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా నేల సారాన్ని ఏ విధంగా కాపాడుకోవాలో వివరించారు. ఇదే వేదికపై ఏపీఎమ్ఏ తెలంగాణ ప్రతినిధి జి. అశోక్ కుమార్ (టాటా ర్యాలీస్) మాట్లాడుతూ.. పంటలలో పురుగుమందుల పిచికారీ సమయంలో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పురుగుమందుల డబ్బాలపై ఉండే గుర్తుల (కలర్ కోడింగ్) ప్రాముఖ్యతపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీనివాస్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. అంజని, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏపీఎమ్ఏ ప్రతినిధి జి. అశోక్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బోడుప్పల్, చెంగిచెర్లలో రూ.1.50 కోట్లతో సీసీ రోడ్ల అభివృద్ధి పనులు

- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

బోడుప్పల్ ,తెలంగాణ చౌరస్తా:

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్, చెంగిచెర్ల డివిజన్లలో మొత్తం రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ శంకుస్థాపన చేశారు.బోడుప్పల్ డివిజన్ పరిధిలోని రాజా లింగం కాలనీ ఫేజ్2లో రూ.90 లక్షల వ్యయంతో, చెంగిచెర్ల డివిజన్ పరిధిలోని శివదుర్గ కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ డివిజన్ అధ్యక్షుడు పొగుల నర్సింహారెడ్డి, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పొగుల దిలీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుర్రి మహేష్, అసర్ల బీరప్ప, వైస్ ప్రెసిడెంట్ రసాల కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, కిరణ్ కుమార్ రెడ్డి, కొత్త చందర్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు బ్రహ్మన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు కుర్రి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో గుర్తుతెలియని

వ్యక్తి మృతదేహం కలకలం

- మసీదు సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన జీహెచ్ఎంసీ స్వీపర్..
- ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:



మియాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. మియాపూర్ చౌరస్తా సమీపంలోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద మసీదు పక్కన ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు.నవంబర్ 1వ తేదీ తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో జీహెచ్ఎంసీ మియాపూర్ సర్కిల్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న ఉబిది భవాని రోడ్డు శుభ్రం చేస్తుండగా, సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి నేలపై పడి ఉండటాన్ని గమనించారు. దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే 100 నంబర్‌కు సమాచారం అందించడంతో మియాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి గుర్తింపు, మరణానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మృతుడిని గుర్తించిన వారు లేదా అతడి కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు కింది నంబర్లకు సమాచారం అందించాలని మియాపూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

మియాపూర్ పోలీసుల సంప్రదింపు నంబర్లు:

* ఎస్‌హెచ్‌ఓ: 8712663170
* మియాపూర్ పోలీస్ స్టేషన్: 8712663179
* దర్యాప్తు అధికారి ఏఎస్ఐ కె. సంగయ్య: 8712567170




మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

- కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

మైనర్లకు వాహనాలు ఇచ్చే వారితో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, రికార్డుల పరిరక్షణ, సిబ్బంది పనితీరు, ట్రాఫిక్ విధుల అమలును సమీక్షించారు. విధుల నిర్వహణలో సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని సూచించారు.అనంతరం ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికడుతూ వాహన దారులకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్ 2 శేషాద్రి రెడ్డి, ఏడీసీపీ వీరన్న, ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, సీఐ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆపదలో అండగా నిలిచిన జీవన్ జ్యోతి భీమా

- బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన పథకం పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికారులు తెలిపారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సబితం శాఖ పరిధిలో ఖాతాదారుడిగా ఉన్న అగ్గి శ్రావణ్ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకంలో సభ్యత్వం పొందారు. ఆయన మృతి చెందడంతో పథకం నిబంధనల ప్రకారం ఎల్ఐసీ ఆఫ్ ఇండియా ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా పరిహారం చెక్కును సోమవారం బ్యాంకు అధికారులు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ.. తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల్లో ప్రతి ఒక్కరూ చేరి బీమా రక్షణ పొందాలని సూచించారు. ఆపద సమయంలో ఈ పథకాలు బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రమేష్, అసిస్టెంట్ మేనేజర్ దేవాన్ష్, క్యాషియర్ సదయ్య, బ్యాంకు సిబ్బంది, లబ్ధిదారుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బోల్గం రవీందర్ గౌడ్

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా బోల్గం రవీందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు రామచంద్ర రావు అధికారికంగా నియామక పత్రాన్ని జారీ చేశారు. సంఘం ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, సంఘం అభివృద్ధికి కృషి చేయాలని నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన బీసీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు రామచంద్ర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ కార్మికులు, గీత కార్మికులు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు గుండాల మల్లేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్యాల రాములు గౌడ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చెత్త నిర్వహణపై విస్తృత అవగాహన



- ఇంటింటా నాలుగు రకాల డస్ట్‌బిన్లు తప్పనిసరి
- సర్పంచ్ రాజపాక నవనీత మహేష్

అబ్దుల్లాపూర్‌మెట్ ,తెలంగాణ చౌరస్త

గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో మంగళవారం తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచపాక నవనీత మహేష్‌మాట్లాడుతూ..గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో తప్పనిసరిగా నాలుగు రకాల డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకుని, చెత్తను దేనికది వేరువేరుగా వేయాలని సూచించారు. సరైన పద్ధతిలో చెత్త సేకరణ జరగడం వల్ల గ్రామం అంటువ్యాధుల బారిన పడకుండా ఉండటంతో పాటు పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సూరిబాబు,వార్డు సభ్యులు,గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

- సిద్దిపల్లిలో ఐదుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహ మంజూరి పత్రాలు అందజేత

కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:

మంథని నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ పేర్కొన్నారు. కమాన్‌పూర్ మండలం సిద్దిపల్లి గ్రామంలో మంగళవారం లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహ మంజూరి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సిద్దిపల్లి గ్రామంలో మొదటి విడతగా ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మరికొంత మంది అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి గృహాలు అందజేయడమే ప్రభుత్వ ప్రథమ ధ్యేయమని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలోనే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, అందులో భాగంగానే కమాన్‌పూర్ మండలంలో అంతర్గత రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, వైకుంఠ రథాలు వంటి మౌలిక వసతులను ఇటీవల సమకూర్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపల్లి సర్పంచ్ బంగారి కళ్యాణి మహేష్, కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉప సర్పంచ్ కొత్తపల్లి సతీష్, రెబల్ రాజ్ కుమార్, నాయకులు గడ్డం శ్రీనివాస్, కూచన రవి, చిప్ప రాజ్ కుమార్, వార్డు సభ్యురాలు కురుమ శిరీష తదితరులు పాల్గొన్నారు.





శంబులింగేశ్వర ఆలయ నూతన కమిటీకి ఘన సన్మానం

- ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి
- తీగల గిరిధర్ రెడ్డి

నూతనకల్ తెలంగాణ

నూతనకల్ మండల కేంద్రంలోని శ్రీశ్రీ శంబులింగేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నియమితులైన ఆలయ కమిటీ సభ్యులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి హాజరై నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని, ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేలా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన ఆలయ చైర్మన్ పగిళ్ల వెంకట్ రెడ్డి ఉపాధ్యక్షులు: జక్కుల ఉపలయ్య, మొగుళ్ల వెంకన్న, యండ్లపల్లి వెంకన్న, దికొండ కరుణాకర్ ప్రధాన కార్యదర్శి: బద్దం వెంకట్ రెడ్డి కోశాధికారి: సబాది అశోక్ రెడ్డి కార్యదర్శులు: బండి చంద్రయ్య, వీరుమల్ల హుస్సేన్, వాల్దాసు ఇస్తారి కార్య వర్గ సభ్యులు: పగిళ్ల అశోక్ రెడ్డి, భూతం శంకర్, పూజల కోటయ్య..ఈ కార్యక్రమంలో చురకంటి చంద్రారెడ్డి, బోడుపల్లి అంజయ్య, కాటేపల్లి దేవకుమార్, మేడిపల్లి శ్రీనివాస్, ఇమ్మారెడ్డి మల్లారెడ్డి, మహేశ్వరం వెంకటయ్య, బూరెడ్డి సంజీవరెడ్డి, బండారి లింగారెడ్డి, దేవిరెడ్డి నర్సిరెడ్డి, ఉప్పుల రాజలింగం, బండపల్లి సాగర్, మద్దెల సురేందర్, జటంగి గణేష్, బతిని లింగయ్య, బండపల్లి చంద్రు, వార్డు సభ్యుడు నెల్లుట్ల మహేష్, కొల్లు జనార్ధన్ రెడ్డి, ఇమ్మారెడ్డి లింగారెడ్డి, ఇమ్మారెడ్డి మహేష్, కందుకూరి శ్రీకాంత్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులు

- పోలీసుల తనిఖీల్లో యువకుల గుర్తింపు,కేసు నమోదు

కమలాపూర్, తెలంగాణ చౌరస్తా:

కమలాపూర్ మండలంలోని అంబాల వాగు వద్ద శనివారం రోజున గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం...అంబాల గ్రామానికి చెందిన కూకట్ల అజయ్,గూడూరు గ్రామానికి చెందిన పాక రాజు వాగు సమీపంలో గంజాయి సేవిస్తుండగా ఎస్సై ఏ.మధు, సిబ్బంది తనిఖీల్లో గుర్తించారు.వెంటనే వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పులిగిల్ల నవీన్ వెల్లడించారు.యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు.గంజాయి వినియోగం,విక్రయాలపై నిరంతరం నిఘా ఉంచామని,నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.






ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు హెచ్చరిక
- నెలకు రూ.18 వేల వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని శేరిలింగంపల్లి ఆశా వర్కర్లు హెచ్చరించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శేరిలింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ.. తమకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.50 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన వారి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు తక్షణమే చెల్లించాలని కోరారు.ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశా వర్కర్లకు అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, రెండో పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి కొంగరి కృష్ణ, ఆశా వర్కర్లు వనజ, నీరజ, సలీమా, ధర్మజన్, హేమలత తదితరులు పాల్గొన్నారు.





నకిలీ నోట్ల చలామణి ముఠా గుట్టురట్టు

- రూ.6.78 కోట్ల నకిలీ కరెన్సీ స్వాధీనం
- ప్రింటింగ్ సామగ్రి, డమ్మీ పిస్టల్, వాకీటాకీలు సీజ్
- కుంట్లూర్‌లో రహస్యంగా నోట్ల ముద్రణ కేంద్రం
- ఎన్‌హెచ్-65పై తనిఖీల్లో చిక్కిన ముఠా
- నలుగురు నిందితుల అరెస్ట్..
- మరో ముగ్గురి కోసం పోలీసుల గాలింపు

అబ్దుల్లాపూర్‌మెట్, తెలంగాణ చౌరస్తా:

భారీ ఎత్తున నకిలీ కరెన్సీ ముద్రిస్తూ చలామణి చేస్తున్న అంతరాష్ట్ర ముఠా గుట్టును ఫ్యూచర్ సిటీ పోలీసులు రట్టు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ ఎస్ఓటీ బృందం సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6.78 కోట్ల విలువైన రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రింటింగ్ సామగ్రితో పాటు డమ్మీ పిస్టల్, వాకీటాకీలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఎన్‌హెచ్ 65పై తనిఖీల్లో పట్టుబడిన నిందితులు



కున్నారు. నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించిన ప్రింటింగ్ సామగ్రితో పాటు డమ్మీ పిస్టల్, వాకీటాకీలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఎన్‌హెచ్ 65పై తనిఖీల్లో పట్టుబడిన నిందితులు సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1వ తేదీన రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలోని ఎన్‌హెచ్ 65పై పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా నకిలీ కరెన్సీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కారులో ఉన్న మదుపోజు కర్ణాకర్ (27), చిన్నోళ్ల మాణిక్య రెడ్డి (52), చెరుకుపల్లి రత్నాకర్ రెడ్డి (30), కరణం అజయ్ కుమార్ (34)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కుంట్లూర్‌లో అద్దె ఇంట్లో ముద్రణ కేంద్రం

నిందితులను విచారించగా కుంట్లూర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని రహస్యంగా నకిలీ కరెన్సీ ముద్రిస్తున్నట్లు వెల్లడైంది. వారి సమాచారంతో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి నకిలీ నోట్ల తయారీకి ఉపయోగిస్తున్న ప్రింటర్లు, ల్యాప్‌టాప్, కటింగ్ యంత్రాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.6.78 కోట్ల విలువైన నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.

నకిలీ పోలీసుల అవతారంలో బెదిరింపులు

ఈ ముఠా నకిలీ నోట్ల ముద్రణతో పాటు పోలీసుల మాదిరిగా వ్యవహరిస్తూ ప్రజలను బెదిరించి డబ్బులు దోచుకునేదని సీపీ వెల్లడించారు. నకిలీ పోలీస్ గుర్తింపు కార్డులు, వాకీటాకీలు, డమ్మీ పిస్టల్స్ ఉపయోగించి పోలీసుల అవతారంలో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకునేవారని వివరించారు.

మరో ముగ్గురి కోసం గాలింపు

ఈ ముఠాతో సంబంధం ఉన్న జల్లి వెంకటేష్, కుంజ బాలరాజు, కంపసాటి శ్రీనివాస్ పరారీలో ఉన్నారని, వారి కోసం దర్యాప్తు కొనసాగుతోందని సీపీ తెలిపారు.ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన మహేశ్వరం డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.పి.వి. రాజు పర్యవేక్షణలో పనిచేసిన షాద్‌నగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. రాజు, వారి సిబ్బందిని పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అభినందించారు.



మియాపూర్ భూములను ఉద్యమకారులు,

నిరుపేదలకు కేటాయించాలి

- 15 వేల పేద కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న భూములపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న సుమారు 15 వేల పేద కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ డిమాండ్ చేశారు.మంగళవారం పార్టీ నాయకులతో కలిసి సదరు భూములను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా నివాసముంటున్న ఎంఏ నగర్, స్టాలిన్ నగర్, పీఏ నగర్, ప్రశాంత్ నగర్ కాలనీల ప్రజల ఇళ్లను క్రమబద్ధీకరించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలకు కేటాయించాలని సూచించారు.ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు కేటాయించకుండా పేదల ప్రయోజనాలకే వినియోగించాలని స్పష్టం చేశారు. ఒకవైపు స్థానిక నివాసితులకు భరోసా కల్పిస్తూనే, మరోవైపు 550 ఎకరాల భూముల విక్రయంపై ప్రభుత్వం ప్రకటనలు చేయడం ప్రజల్లో ఆందోళనకు దారితీస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే ఈ భూముల విషయంలో స్పష్టత ఇచ్చి పేద కుటుంబాలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితులకు అండగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు గూడ లావణ్య, విష్ణుచారి, కుమార్ యాదవ్, సుజాత, ప్రవీణ్ బిజిలి, శ్రీనివాస్ నేత, సందీప్, రవికుమార్ పాల్గొన్నారు.



కమాన్ పూర్ మండల పరిషత్

సర్వసభ్య సమావేశం

- గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సర్పంచుల వినతి
- విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల సత్వర చెల్లింపుపై చర్చ

కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:

కమాన్‌పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో సాదినేని ప్రియాంక అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎదురవుతున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించే బాధ్యత అధికారులపైనే ఉందని గుర్తుచేశారు. ప్రధానంగా గ్రామాల్లో లూజ్ వైర్లు, విద్యుత్ లైన్లను వెంటనే సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకు పనులు వేగవంతమయ్యేలా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మండలంలో ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున, దానిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ముస్తాల వాసంతి, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావులతో పాటు సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, బొంగోని సదయ్య గౌడ్, బంగారి కళ్యాణి మహేష్, పోనగంటి కుమార్, శిలారపు మల్లయ్య, జంగిలి పోషాలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులను

ఓటరుగా నమోదు చేయించాలి



- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియకు ఈ నెల 6వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన పట్టభద్రులందరూ సకాలంలో తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం తొర్రూరు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.ఓటరు నమోదు గడువు నవంబర్ 6వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో సమయం చాలా తక్కువగా ఉందని, ప్రజాప్రతినిధులు, పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్,ఎన్ఎస్ యుఐ నాయకులు ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి,అవసరమైన సహకారం అందించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి,పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బచ్చల లక్ష్మణ్, నాయకులు జాటోత్ రవి నాయక్, మహబూబ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,చెవిటి సుధాకర్, మేకల కుమార్,జక్కుల రామ్ రెడ్డి, గుండాల నరసయ్య, ఎనగందుల శ్రీనివాస్,రాజేష్ యాదవ్, మిత్తింటి హరీష్, గంధం సతీష్, అశోక్ రెడ్డి, కిరణ్, చిదురాల రవి, రాఘవులు పాల్గొన్నారు.



ముస్లిం,మైనారిటీల అభివృద్ధికి

కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తురుక,కాశ సామాజిక వర్గానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు కటింగ్ మిషన్లు, జనరేటర్ కిట్లను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ....

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. నిన్న జరిగిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమానికి రూ.3,500 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని, దీంతో ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు.స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినా మైనార్టీల బతుకులు మారలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముస్లిం సోదరుల జీవితాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు.గత ప్రభుత్వాలు మైనార్టీలను ఓటు బ్యాంకులా మాత్రమే చూశాయన్నారు.తెలంగాణలో మాత్రమే సర్వమత సామరస్యం పరిఢవిల్లుతున్నదని పేర్కొన్నారు. కటింగ్ మిషన్లు, జనరేటర్ కిట్ల పంపిణీ ద్వారా తురక కాశ సామాజిక వర్గం వారు ఆర్థిక స్వావలంబన సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, తొర్రూరు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు,తురుక కాశ సంక్షేమ సంఘం ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడే సాబ్,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.జహంగీర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి,మున్సిపల్ కౌన్సిలర్,పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, తురక కాశ సంఘం నాయకులు ఎస్కె.హైదర్, అంజాద్, రహీం, సలీం ,యాకూబ్, మహీద్,హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెవిటి సధాకర్, దేవేందర్ రాజు,ప్రవీణ్ యాదవ్, వల్లపు యాకయ్య,మహేష్ యాదవ్,నదీమ్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థుల

విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

- సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్
- ఆధ్వర్యంలో 'భవిత' క్రియాశీలత కార్యక్రమం


అబ్దుల్లాపూర్‌మెట్ ,తెలంగాణ చౌరస్తా:

దివ్యాంగ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారి విద్యాభివృద్ధికి ప్రత్యేక సహకారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. సమగ్ర శిక్షా తెలంగాణ ఆధ్వర్యంలో, సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ నేతృత్వంలో మండల పరిధిలోని భవిత కేంద్రంలో మండల స్థాయి దివ్యాంగ విద్యార్థుల క్రియాశీలత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన సర్పంచ్.. దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలోని ప్రత్యేక సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.దివ్యాంగ పిల్లలు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకు సాగేలా ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ శ్రీశైలం గౌడ్‌తో పాటు మండల విద్యాధికారి జగదీశ్వర్, భవిత కేంద్రం నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ ఉద్యోగుల

సమస్యలు పరిష్కరించాలి



- ఈ మేరకు ఓదెల మండల తహసీల్దార్,ఎంపిడిఓ కు ఉద్యోగుల వినతి

ఓదెల, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు,ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మోడల్ స్కూల్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏంఎస్ జెఏసి) పిలుపు మేరకు మూడవ రోజు నిరసన కార్యక్రమంలో భాగముగా ఓదెల మండల ఎంఆర్వో, ఎంపిడిఓ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన డిమాండ్లుగా ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని,జీవో 317 మార్గదర్శకాలు అమలులో ఉద్యోగులకు న్యాయం చేయాలని,బదిలీలు,పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని,పెండింగ్‌లో ఉన్న డిఏ బకాయిలను చెల్లించాలన్నారు. కారుణ్య నియామకాలను చేపట్టాలని,టిజిటిలకు నోషనల్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు.హిందీ పిజిటి పోస్టులను భర్తీ చేయాలని,జూనియర్ లెక్చరర్ పోస్టులను ఉన్నతీకరించాలని,అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,సిపిఎస్ కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలన్నారు.రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని,గంటల ప్రాతిపదికన పని చేయుచున్న ఉపాధ్యాయులకుగౌరవ వేతనము చెల్లించుట,వంటి ,సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర కార్యదర్శి మండ తిరుపతి,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శిరీష జాక్ సభ్యులు శ్రీనివాస్,సుజాత,సుధాకర్, ప్రసాద్,మధుకర్,సంపత్, విజయలక్ష్మి,సుజాత పాల్గొన్నారు.







స్నేహం ముసుగులో ఘాతుకం

- 7 గురు హంతకుల ఆటకట్టు మరో ముగ్గురి అరెస్ట్,
- కటకటాల్లోకి ప్రధాన నిందితులు!
- అక్టోబర్ 28న నలుగురు, నవంబర్ 3న మరో ముగ్గురి అరెస్ట్
- కేసును ఛేదించి, నిందితులను రిమాండ్‌కు తరలించిన లక్ష్మీదేవిపల్లి పోలీసులు
- పోలీస్ యంత్రాంగానికి వెల్లువెత్తుతున్న అభినందనలు, కృతజ్ఞతలు..

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,తెలంగాణ చౌరస్తా :

లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ ప్రాంతంలో సంచలనం సృష్టించిన 20 ఏళ్ల యువకుడు మేడి అఖిల్ దారుణ హత్య కేసును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ యంత్రాంగం పక్కా ప్లాన్‌తో, అత్యంత చాకచక్యంగా పూర్తిస్థాయిలో ఛేదించింది. కన్న కొడుకు విగతజీవిగా మారడంతో గుండెలవిసేలా రోదిస్తున్న సత్యవాణి, పాపయ్యల కన్నీళ్లకు న్యాయం చేస్తూ.. ఈ ఘోరానికి పాల్పడిన ఏడుగురు నిందితుల ఆటకట్టించి జైలుకు తరలించారు.

నమ్మించి తీసుకెళ్లి.. రాక్షసానందం!

గతంలో జరిగిన చిన్నపాటి వివాదాలను మనసులో పెట్టుకుని, "పాత పగలు వద్దు.. మళ్లీ పాతలాగే ఉందాం" అంటూ నమ్మించిన స్నేహితులే అఖిల్ పాలిట యమపాశమయ్యారు. మద్యం తాగిస్తామని నమ్మించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, పదునైన కత్తితో మెడపై పొడిచి, సిమెంట్ ఇటుకలతో ముఖంపై మోది కిరాతకంగా కడతేర్చారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

రెండు విడతల్లో హంతకుల అరెస్ట్ – కటకటాల్లోకి ఏడుగురు.!

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీస్ బృందాలు కేసు దర్యాప్తును వేగవంతం చేశాయి.అక్టోబర్ 28న మొదటి విడత అరెస్టులుకేసు నమోదు అయిన వెంటనే లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల అప్రమత్తమై, సాంకేతిక ఆధారాల సహాయంతో ప్రధాన నిందితులు ఏ 1 దంత్యాల గణేష్ @గని, ఏ 2 సిరిపురం సాత్విక్ @ చిన్ను, a3 ముద్దంగుల వెంకటేష్ @ చిన్ని, ఏ 6 తరాల ప్రదీప్లను కొత్తగూడెం బస్ స్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకుని అక్టోబర్ 28న రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి హత్యకు వాడిన కత్తి, రక్తపు మరకల దుస్తులు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నవంబర్ 03న మిగిలిన ముగ్గురి అరెస్ట్..!

దర్యాప్తును మరింత లోతుగా జరిపిన పోలీసులు, ఈ హత్య పథకంలో ప్రమేయం ఉన్న ఎదురుగడ్డ గ్రామానికి చెందిన సురేష్, పవన్, వినోద్‌లను నవంబర్ 3న అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. దీంతో ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితుల పాత్రను నిర్ధారించి కటకటాల్లోకి నెట్టారు.

చట్టం ముందు ఎవరైనా లొంగాల్సిందే – డీఎస్పీ హెచ్చరిక..!

ఈ కేసు వివరాలను వెల్లడించేందుకు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ.. ఎంతటి వారైనా తప్పు చేస్తే చట్టం నుంచి తప్పించుకోలేరని నిరూపించామన్నారు. నేర ప్రవృత్తితో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, నిందితులపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని ఘాటుగా హెచ్చరించారు.


పోలీస్ విభాగానికి వెల్లువెత్తుతున్న కృతజ్ఞతలు..!

అఖిల్ హత్య కేసును ట్విస్ట్‌లు లేకుండా, నిందితులను తప్పించుకోనివ్వకుండా వెంటాడి పట్టుకున్న పోలీసులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నిందితులను వేగంగా అరెస్ట్ చేసిన పోలీసులను అభినందిస్తూనే, అర్ధరాత్రి దాటినా కొనసాగుతున్న అక్రమ బెల్ట్ షాపులు, జూదపు అడ్డాలపై ఎక్సైజ్ పోలీస్ శాఖలు మరింత కఠినంగా వ్యవహరించి ఉక్కుపాదం మోపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బెల్టు దుకాణాలపై భగ్గుమన్న సర్పంచులు

- ఎక్సైజ్ ఎస్ఐకి ప్రశ్నల వర్షం...
- ఎంఆర్‌పీ కంటే అధిక ధరలపై ఆగ్రహం

కమలాపూర్, తెలంగాణ చౌరస్తా:



కమలాపూర్ మండలంలో బెల్టు దుకాణాల నిర్వహణపై సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్‌ను నిలదీశారు.సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై వాడీవేడిగా చర్చ జరిగింది.బెల్టు దుకాణాలకు అనుమతులు ఎవరిచ్చారు..?ఫిర్యాదులు చేసినా చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. మద్యం సీసాలపై ఉన్న ఎంఆర్‌పీ కంటే రూ.20 నుంచి రూ.50 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు.గతంలో ఆధారాలు ఇస్తే దాడులు చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.ఇప్పటివరకు ఎన్ని దాడులు నిర్వహించారు..? ఎన్ని కేసులు నమోదు చేశారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బెల్టు దుకాణాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.



ఈనెల 7న మండల సర్వసభ్య సమావేశం

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోగల మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 7న శనివారం రోజున 11:30 గంటలకు మండల సర్వసభ్యసమావేశంని మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని మండల ఎంపీడీవో సురేందర్ కుమార్ తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్ లు,అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు.



చిరుతల కళా బృందాన్ని అభినందించిన పెర్క శ్యామ్

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

పెద్దపల్లి మండలం అన్నంతునిపేట గ్రామానికి చెందిన శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చిరుతల కళాబృందం సభ్యులు టీపీసీసీ నాయకులు పెర్క శ్యామ్ ని వైట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా చిరుతల కళాబృందం సభ్యులు గత 30 సంవత్సరాలుగా చిరుతల రామాయణం,చిరుతల మహాభారతం తదితర పౌరాణిక, సాంస్కృతిక అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కళా ప్రదర్శనల గురించి వివరించారు. వారి కళా ప్రదర్శనను తెలుసుకున్న పెర్క శ్యామ్ విజ్ఞప్తి మేరకు వైట్ హౌస్‌లో కొంత సమయం పాటు చిరుతల కళా ప్రదర్శనను నిర్వహించారు.ఈ సందర్భంగా పెర్క శ్యామ్ మాట్లాడుతూ...చిరుతలతో కళా ప్రదర్శన నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు.చిరుతల రామాయణం,చిరుతల మహాభారతం వంటి కళా ప్రదర్శనల ద్వారా ప్రజలకు రామాయణం,మహాభారతం కథలు సులభంగా చేరువవుతున్నాయని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో భక్తి భావాలను పెంపొందించడంతో పాటు,మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో చిరుతల కళాబృందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు.గత 30 సంవత్సరాలుగా కళను నమ్ముకుని,మన సంస్కృతి సంప్రదాయాలను ప్రజలకు అందిస్తున్న శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చిరుతల కళాబృందం సభ్యులను ఈ సందర్భంగా పెర్క శ్యామ్ ప్రత్యేకంగా అభినందించారు. అన్నంతునిపేట గ్రామానికి,పెద్దపల్లి జిల్లాకు తమ కళా ప్రదర్శనల ద్వారా గుర్తింపు తీసుకురావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.భవిష్యత్తులో చిరుతల కళాబృందం మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షిస్తూ,వారు చేసే కృషికి తన వంతు సహకారం,మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని పెర్క శ్యామ్ హామీ ఇచ్చారు.



రైతుల ధాన్యం కొనుగోళ్లకూ రాజకీయాలా...?

- పాడి కౌశిక్‌రెడ్డి పద్ధతి మార్చుకో.ఏఎంసి చైర్మన్ జాన్సీ రవీందర్
- కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ కాంగ్రెస్ నేతల ఆగ్రహం

కమలాపూర్, తెలంగాణ చౌరస్తా

రైతుల కష్టాలు కనిపించడం లేదా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అడ్డంకులు సృష్టించడం ద్వారా ఎవరికి ప్రయోజనం రైతులు రోజుల తరబడి ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసి ఎదురుచూస్తుంటే రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ నాయకులు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ప్రశ్నించారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఎమ్మెల్యే సహకరించడం లేదని ఆరోపిస్తూ మంగళవారం కమలాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండిపడ్డారు.అధికారులపై ఒత్తిడి తెస్తూ కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నారని విమర్శించారు.అకాల వర్షాలు కురిస్తే రైతుల ధాన్యం తడిసి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాడి కౌశిక్‌రెడ్డి తన పద్ధతి మార్చుకుని కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సహకరించాలని ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ హితవు పలికారు.అధికారులు వెంటనే కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్,పుల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యువకులను నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

- కవిత నాయకత్వంలో పట్ల నమ్మకంతో...
- తెలంగాణ రక్షణ సేనలో కొనసాగుతున్న యువకుల చేరికలు
- నిరుద్యోగ భృతి ఉసే లేదు
- టి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ రక్షణ సేనలో యువత చేరికలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని,పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వం పై నమ్మకంతో ఆమె చేస్తున్న ప్రజా పోరాటాల పట్ల ఆకర్షితులై పలువురు యువకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. యువ నాయకుడు రాగడి సందీప్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శనగొండ పవన్ కృష్ణ,దావరి కార్తీక్,జెరిపోతుల నవీన్,మహమ్మద్ అఫ్రోజ్‌లు తెలంగాణ రక్షణ సేనలో చేరారు.వారికి జిల్లా పార్టీ అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ....తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత నాయకత్వంలో రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.యువత రాజకీయాల్లోకి రావడం శుభ పరిణామమని,సమాజంలో మార్పు తీసుకురావడంలో యువకులది కీలకమైన పాత్ర అని వారు అన్నారు.తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరుద్యోగ యువత సమస్యల మీద రైతులు,పేదలు,మధ్యతరగతి ప్రజల ఇబ్బందుల మీద తెలంగాణ రక్షణ సేన నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.పార్టీ సిద్ధాంతాలు కవిత నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన యువకులకు సముచిత గుర్తింపు గౌరవం ఉంటాయని తెలిపారు.యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరి తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ అంకం శివరాణి,నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్,జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మడిపల్లి వినీత్,జిల్లా నాయకులు గర్షకుర్తి విద్యాసాగర్,గుంజపడుగు పవన్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ,అంతర్జాతీయ స్థాయి నిపుణుల ప్రేరణాత్మక ప్రసంగం



కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మల్యాల గ్రామంలో గల పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్జూనియర్ కళాశాల లో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ,అంతర్జాతీయ స్థాయి నిపుణుల ప్రేరణాత్మక ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా లయన్ కెప్టెన్ డా.బుర్ర మధుసూదన్ రెడ్డి,పఠం శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులు ఒత్తిడిని అధిగమించే పద్ధతులను వివరించారు.డా.బుర్ర మధుసూదన్ రెడ్డి ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్‌గా,కవిగా,రచయితగా, కాలమిస్టుగా విశేష సేవలందించారు.రాష్ట్రపతి ఉత్తమ సేవా అవార్డు,తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం,జాతీయ ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతగా గుర్తింపు పొందారు.అంతేకాకుండా వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా,కలెక్టర్లు ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ అందించిన అనుభవం కలిగిన ప్రముఖ విద్యావేత్త.మరో వక్త పథేం శ్రీనివాస్ హైదరాబాద్‌కు చెందిన శిక్షణ పొందిన మానసిక నిపుణులు,విద్యార్థులకు మానసిక ఆరోగ్యం,ఆత్మవిశ్వాసం,భావోద్వేగ నియంత్రణ,సానుకూల ఆలోచనా విధానం ఒత్తిడిని అధిగమించే పద్ధతులపై విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ...విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు,వ్యక్తిత్వ వికాసం,క్రమశిక్షణ,సమయపాలన,లక్ష్య నిర్దేశం,ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచనలు,భవిష్యత్తు కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు.జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని,నిరంతర కృషి, పట్టుదల,సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థులు కేవలం విద్యా పరమైన విజయాలకే పరిమితం కాకుండా,మంచి విలువలు,సామాజిక బాధ్యత, నాయకత్వ సామర్థ్యాలు కలిగిన ఆదర్శ పౌరులుగా ఎదగాలని వక్తలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని,ఆత్మవిశ్వాసాన్ని నింపి, వారి వ్యక్తిత్వ వికాసానికి భవిష్యత్తు ఉన్నతికి మార్గదర్శకంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు



- ధాన్యం కొనుగోళ్లో పారదర్శకంగా ఉండాలి
- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి,గంగారం,కునారం, మంగపేట,వెన్నంపల్లి,జాఫర్ఖాన్ పేట,ఇదులాపూర్ గ్రామాల్లో ఐకేపీ అండ్ సింగిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్,శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని రైతన్నలు అందరూ కలిసికట్టుగా ఉంటూ రైతులకు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్మినో ప్రభావంతో భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సమృద్ధిగా పండే మొక్కజొన్న (మక్కలు),శెనగ వంటి ఆరుతడి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు.దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు మండలంలో ఐకేపీ,సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని,సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్ కుమార్,మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గజనవేన సదయ్య,ఏపీఎం లవ కుమార్,మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ లు,సర్పంచ్ లు రేకుల జ్యోతి రఘు,ఆరేళ్ళి రమేష్,ఆకుల శ్రీనివాస్, మంథెన రాజయ్య కలవేని రమ రమేష్,యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్,మామిడి లత అశోక్,ఉపసర్పంచ్ లు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,రైతులు,మహిళా సంఘాల సీసీలు,సీఏలు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.



ఆల్ట్రాటెక్ కార్మికులకు దీపావళి బోనస్

- పర్మనెంట్ కార్మికులకు రూ.47,000
- కాంట్రాక్టు కార్మికులకు రూ.46,400

పాలకుర్తి, తెలంగాణ చౌరస్తా:



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని ఆల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం కార్మికులకు దీపావళి పండుగ సందర్భంగా బోనస్ ప్రకటించింది.మూడేళ్ల అగ్రిమెంట్ ప్రకారం ఈ ఏడాది కూడా బోనస్ మొత్తాలను నిర్ణయించింది.దీని ప్రకారం పర్మనెంట్ కార్మికులకు రూ.47,000,కాంట్రాక్టు కార్మికులకు రూ.46,400, లోడింగ్ కార్మికులకు రూ.46,900 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది.ఈ మొత్తాన్ని కార్మికుల జీతాల్లోనే జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.దీంతో పాటు ప్రతి కార్మికుడికి ఒక స్వీట్ బాక్స్ అందజేయనున్నారు. మూడేళ్ల ఒప్పందం ప్రకారం ఈసారి కూడా బోనస్ ప్రకటించడం పై కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరినాథ్,జనరల్ సెక్రటరీ మాదాసు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.పండుగ వేళ బోనస్‌ను జీతాల్లో జమ చేయడం పట్ల కార్మికులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.